క్లుప్తంగా

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

తెనాలి అర్బన్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్, చినరావూరు వాకర్స్ సొసైటీ అధ్యక్షుడు గుంటూరు కోటేశ్వరరావు సూచించారు. చినరావూరు వాకర్స్ సొసైటీ ఆధ్వర్యంలో శిల్పి అక్కల వెంకటేశ్వరరావు సహకారంతో ఆదివారం పార్కులో ఏర్పాటు చేసిన క్రియాటిన్ పరీక్ష కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల జీవన ప్రమాణం పెరుగుతుందని తెలిపారు. చినరావూరు పార్కులోని వాకర్స్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వాకర్స్‌కు క్రియాటిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు, ప్రతినిధులు కేసన శేఖరరావు, బూరెల నరసింహారావు, అద్దెపల్లి సాంబశివరావు, కొత్తమాసు కుమార్, ఓంకార ప్రసాద్, టి.లక్ష్మీప్రియ, కె.దివ్య, రాంబాబు, సుబ్బారెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

బైక్‌ను దహనం చేసిన దుండగులు

తెనాలి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జి వద్ద నిలిపి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. లాడ్జిలో పని చేసే యువకుడి బైక్ దగ్ధమవుతూ పొగలు రావడాన్ని శనివారం రాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో లాడ్జిలో ఉన్న వారు గమనించారు. గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టి ఉంటారని వాహన యజమాని అనుమానిస్తున్నాడు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



తెనాలి అర్బన్: క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో గంగానమ్మపేటలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ బి.రాధ పేర్కొన్నారు. 10 మంది విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు నగదు బహుమతులు లభించినట్లు చెప్పారు. స్కూల్ ఆవరణలో ఆదివారం విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ గోపి, రాజేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలి అర్బన్: మహర్షి దయానంద సరస్వతి జన్మదినాన్ని పురస్కరించుకుని నందివెలుగులోని వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో 50మంది క్షయ, ఎయిడ్స్ రోగులకు ఆదివారం పాత ప్రభుత్వ వైద్యశాలలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తుమ్మల కృష్ణకుమారి, గుగ్గిలం రామమోహనరావు, కూరపాటి రవీంద్రనాథ్, కల్యాణి, జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొలసాని రామ్‌చంద్, కటకం ప్రసాద్, పల్లెకొండ రవికుమార్, అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

మంగళగిరి: మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికను చినకాకానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. అతడికి ఇప్పటికే పెళ్లి అయి పిల్లలున్నారు. ఈ విషయాన్ని దాచి బాలికను మోసం చేయడంతో బాలిక బంధువుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రతి వ్యక్తికీ క్షమాగుణం అవసరం



ఫిరంగిపురం: ప్రతి వ్యక్తికి క్షమాగుణం అవసరమని విచారణ గురువు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో ఆదివారం శ్రీసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ భగవంతుడిని ప్రేమించే ప్రతి వ్యక్తి తన శత్రువుని కూడా క్షమించే గుణం కలిగి ఉండాలన్నారు. తనలోని ద్వేషం, కోపం, పగ, పాపం వంటివి తప్పనిసరిగా వదిలి వేయాలని, దాని ద్వారా భగవంతుడిపై ప్రేమ కలుగుతుందన్నారు. భగవంతుడు తన శిష్యులతో మూడు విషయాలు వివరించాడని వాటిలో తన శత్రువుని ప్రేమించాలని, ద్వేషించేవారి కోసం ప్రార్థన చేయాలని, ఎవరు శపిస్తున్నారో వారిని ఆశీర్వదించాలన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. సహాయ విచారణ గురువులు వి.రవీంద్ర, మఠకన్య స్త్రీలు, పెద్దలు పాల్గొన్నారు.

‘జ్ఞానజ్యోతి’తో విద్యా వికాసం

- అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ
- చిన్నారుల జీవితాల్లో వెలుగులు
- సమూలంగా మారనున్న చదువులు



కొల్లిపర మండలంలో అంగన్‌వాడీలకు శిక్షణ (ఫైల్)

కొల్లిపర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసు గల చిన్నారులకు ఆటపాటలతో చదువులు అందించేలా జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలను కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ ఉపయోగపడుతుంది. ఇందులో నేర్చుకున్న అంశాలను తరగతుల్లో బోధించడం వల్ల చిన్నారుల జీవితాల్లో వెలుగులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్ బీ–పడాయి భీ పథకం అమలుపై కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకనుగుణంగానే మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖాధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పునాదులు

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకొని, మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0–6 సంవత్సరాల వయసు గల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్‌కు దిక్సూచిగా నిలువాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు పెంపొందించడంతో పాటు ప్రతి కేంద్రానికి ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

టీచర్లకు శిక్షణ ఇలా..

మాతా శిశు సంక్షేమ శాఖ , విద్యాశాఖ, సర్వశిక్ష అభయాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) ప్రోగ్రాం పరిధిలో భాగంగా మండలంలో సుమారు 58 మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. దీనివల్ల కొల్లిపర మండలంలో ఆరు నెలలు నుంచి మూడేళ్లలోపు 1030 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సున్న 854 మంది చిన్నారులు ప్రయోజనం పొందనున్నారు.

శిక్షణ లక్ష్యం

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం. శారీరక, సామాజిక భావోద్వేగం, నైతికత, మేధాభివృద్ధి, భాష–అక్షరాస్యత, సౌందర్య–సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రామాణికంగా చిన్నారుల భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా 120రోజులు శిక్షణ ఇస్తారు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు

అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు అందిస్తారు. మూడేళ్ల వ్యవధిలో ఏడాదికి 40రోజుల చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ అందిస్తారు. తొలిదశలో 20రోజులు, మలి దశలో 20రోజుల చొప్పున కొనసాగుతున్న ఈ శిక్షణను హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు.అంటే ఆరు రోజుల పాటు ఆఫ్‌లైన్, 14రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయి. విద్యాశాఖ, సర్వశిక్ష అభయాన్, మహిళా శిశుసంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు.

శిక్షణ వల్ల టీచర్లకు మేలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, కార్యకర్తలకు నూతన శిక్షణలో భాగంగా చిన్నారులకు బోధన గురించి తెలియజేస్తున్నారు. దీని వల్ల మార్పులు తప్పకుండా వస్తాయి. ఆటపాటలతో బోధించే విధానం వల్ల చిన్నారులు శ్రద్ధగా నేర్చుకుంటారు.

–ఎం.సునీత, సీడీపీఓ, తెనాలి ప్రాజెక్టు

పార్టీకి కార్యకర్తలు, నాయకుల ఐక్యతే పునాది

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలు, నాయకుల ఐక్యతే పునాది అని, రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం తప్పక వస్తుందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని నిడుముక్కల గ్రామంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి నాయకుడికీ, కార్యకర్తకు భవిష్యత్తులో పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్కరూ అధైర్య పడకుండా పార్టీ కోసం పనిచేయాలన్నారు. త్వరలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామ, మండల కమిటీల నియామకం జరగనుందని తెలిపారు. అందరి ఆమోదం, ఏకాభిప్రాయంతో పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నాయకులకు అందులో స్థానం కల్పించనున్నట్లు చెప్పారు. విభేదాలను పక్కన బెట్టి పార్టీని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచి, ప్రతి కుటుంబానికి మేలు చేశారని గుర్తుచేశారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు మొదలు , దాడులతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తుండటం దుర్మార్గమని ఖండించారు. అధికారం కోసం అలవికాని హామీలిచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో మాత్రం పూర్తిగా చేతులెత్తేశారనేది బహిరంగ సత్యమన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలు తమ సత్తా ఏంటో చూపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఏసురత్నం, ఎంపీటీసీ బోడపాటి సుశీల, ధర్మరాజు, వివిధ విభాగాల నాయకులు బాకి వెంకటస్వామి, గుంటి రఘువరన్, ముప్పాళ్ల మనోహర్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళపై దాడి

తెనాలి రూరల్: మహిళపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలేనికి చెందిన రవికి పక్క ఇంట్లో నివసించే గంటినపల్లి నాగమణితో వాహనం నిలిపే విషయంలో వివాదం జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న అతడు మరో ఇద్దరు స్నేహితులతో కలసి వెళ్లి ఆమెతో పాటు సహజీవనం చేస్తున్న వ్యక్తిపై దాడి చేశారు. ఇంటి గోడను నెట్టి పడేశారు. అది అదిలక్ష్మికి చెందిన టిఫిన్ బండిపై పడటంతో అది ధ్వంసమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకై మంటలు

తెనాలి రూరల్: పట్టణ సుల్తానాబాద్ ఆలపాటి నగర్‌లోని ఓ ఇంట్లో ఆదివారం గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ వద్ద లీకై మంటలు చెలరేగాయి. గౌరీశంకర్‌కు చెందిన ఇంట్లో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగి ఫ్రిజ్, సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. రూ. 50 వేలు నష్టం సంభవించి ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రచారం



తెనాలి టౌన్: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. స్థానిక ఐతానగర్, హయ్యర్‌పేట ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి పట్టభద్రులను కలిశారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావు అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. విద్యావంతుడు, ఉద్యమ నేపథ్యం కలిగిన లక్ష్మణరావు గెలిస్తే నిరుద్యోగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పి.రాజశేఖర్‌బాబు, టి.విజయ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గుంటూరు రూరల్: నెలనెలా అన్న సంతర్పణలో భాగంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ఆధ్వర్యంలో మండలంలోని ఏటుకూరు గ్రామం అనంతవరప్పాడు రోడ్డులోగల మమ్మీ డాడీ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో 60 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య, క్లబ్ సభ్యులు లయన్ యరసాని కోటేశ్వరరావు, తాడికొండ ఎంఈఓ ధూపాటి ప్రభాకరరావు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యతో ఉపాధి అవకాశాలు మెండు



వేడుకల్లో పాల్గొన్న బిషప్ సుధీర్‌కుమార్

దుగ్గిరాల: మండలంలోని తుమ్మపూడిలో మార్తా నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ, జీఎన్ఎం మొదటి సంవత్సరం నర్సింగ్ విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ వేడుకలు ఆదివారం జరిగాయి. కళాశాల డైరెక్టర్ వై.ఈశ్వర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచానికి నర్సుల ఆవశ్యకత చాలా ఉందన్నారు. విదేశాల్లో మంచి ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. 10 వేల జనాభాకు కేవలం 16 మంది నర్సులు ఉన్నారని పేర్కొన్నారు. ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చెప్పిన విధంగా నర్సింగ్ విద్యార్థులు రోగులకు ప్రేమతో సేవ చేయాలన్నారు. కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, కరస్పాండెంట్ వై.సమీర్‌చంద్ర, మేనేజర్ గిద్యూన్, ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

మందుబాబుల అడ్డాగా కళాశాల ప్రాంగణం



దుగ్గిరాల: మండల కేంద్రంలోని డాక్టర్ కేఆర్ఎం డిగ్రీ కళాశాల ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారింది. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు ప్రాంగణంలో తిష్ట వేస్తున్నారు. తాగిన మద్యం సీసాలను అక్కడే వదిలేస్తున్నారు. ప్రతి రోజు మద్యంతో పాటు సిగరెట్లు, గంజాయి వంటి మత్తుపదార్థాలు తీసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల యాజమాన్యం ఉదాసీన వైఖరి వల్ల మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారని విమర్శిస్తున్నారు. ఇంత జరుగుతున్నా, స్థానిక పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఆధునిక చికిత్సలతో క్యాన్సర్ రోగులకు మేలు

తొలిసారిగా గుంటూరులో ఆర్క హాస్పటల్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు



సదస్సుకు హాజరైన పలువురు క్యాన్సర్ వైద్యులు

గుంటూరు మెడికల్: క్యాన్సర్ వైద్య రంగంలో వస్తున్న అత్యాధునిక వైద్య పద్ధతులతో రోగులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు, చెన్నై అడయార్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ సాగర్ టీజీ అన్నారు. గుంటూరు ఆర్క హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గుంటూరు ఐటీసీ హోటల్‌లో క్యాన్సర్ చికిత్సలో ప్రస్తుత సవాళ్లు, వివాదాలు, ఏకాభిప్రాయం అనే అంశంపై మొట్టమొదటిసారిగా గుంటూరులో జాతీయ క్యాన్సర్ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సాగర్ టీజీ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సా పద్ధతుల్లో నూతనంగా వచ్చిన ఇమ్యూనోథెరపీ, టార్గెటెడ్ థెరపీలతో రోగులకు ఎంతో మేలు చేకూరుతున్నట్లు వెల్లడించారు. ఆధునిక వ్యాధి నిర్ధారణ, నివారణ పద్ధతులు వచ్చాయని, త్వరితగతిన వ్యాధి నిర్ధారణతో త్వరగా క్యాన్సర్‌లకు చికిత్స అందించి నివారించవచ్చని తెలిపారు. క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు రావటం వరమని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథి జైపూర్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ పూర్వీష్ పారిక్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించబోతున్నట్లు వెల్లడించారు. యువ వైద్యులు ఈ నూతన వైద్య విధానాలపై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని వెల్లడించారు. హైదరాబాద్‌కు ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ సెంథిల్ రాజప్పా, కోయంబత్తూరు ఎస్ఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ కృపా శంకర్, చైన్నె విఎస్ హాస్పటల్స్‌కు చెందిన డాక్టర్ జి.వి జయ, ఇతర వైద్యులు హాజరై మెడికల్ ఆంకాలజీలో కొత్త చికిత్సా విధానాల గురించి చర్చించారు. హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ పవన్ రాఘవరెడ్డి, డాక్టర్ హేమంత్ మాకినేని, డాక్టర్ దేవనబోయిన శౌరిరాజునాయుడు, డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ వైద్యులంతా చికిత్సలో ఆధునిక వైద్య పద్ధతుల గురించి తెలుసుకుని రోగులకు ఆధునిక వైద్యసేవలు అందించాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన డీ–3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం బుర్రిపాలెం దగ్గరలోని ఎస్ బిల్డింగ్‌లో నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన రోగులకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ తీశారు. నెలకు సరిపడా మందులను ఇచ్చారు. షుగర్ వ్యాధిగ్రస్తులు పాటించాల్సిన ఆహార నియమాలను తెలియజేశారు. మహిళల్లో క్యాన్సర్ నిరోధానికి 9–14 ఏళ్లలోపు పిల్లలు, 45 సంవత్సరాలలోపు మహిళలు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు చేశారు.

రాగ రంజితంగా పంచరత్న గాన గోష్ఠి



రామస్వామిని గండ పెండేరంతో సత్కరిస్తున్న కనకదుర్గ దంపతులు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేట భాగవతులు వారి వీధిలో గల అనిరుధ్ సదన్‌లో ఆదివారం వీణ గురువు పుచ్చా కనకదుర్గ ఆధ్వర్యంలో పంచరత్న గాన గోష్ఠిని ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామి, గుంటూరుకు చెందిన సంగీత విద్వాంసులు కలిసి శ్రీ త్యాగరాజస్వామి రచించిన ఘన రాగ పంచరత్న కృతులను గాత్రం, వీణ, వయొలిన్, మృదంగం, ఘటం వంటి వాయిద్య సహకారంతో ప్రేక్షకులను రంజింపజేశారు. పాటిబండ్ల జాన శాంతి, రాగంపూడి అమూల్య, అనఘాలు కీర్తనలను ఆలపించారు. వీణపై కనకదుర్గ, మాల్కోస్‌పై వాణి, వయొలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై సుధాకర్, ఘటంపై కిశోర్ సహకరించారు. పంచరత్న సేవ అనంతరం పుచ్చా కనకదుర్గ, శిష్య బృందం పద్మశ్రీ అన్నవరపు రామస్వామిని గండపెండేరంతో సత్కరించారు. కర్ణాటక సంగీత వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు, అనేక మంది కళాకారులకు శిక్షణ ఇవ్వడంలో రామస్వామి చేసిన కృషిని అభినందించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



వీరస్థలి డాక్యుమెంటరీ నటులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

తెనాలి అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం వ్యవస్థాపక దినోత్సవాన్ని కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డుకు ఎంపికైన వీరస్థలి డాక్యుమెంటరీ నటులను ఘనంగా సన్మానించారు. స్కూల్ నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవయజ్ఞం మురళీకృష్ణ, క్లబ్ ప్రతినిధులు గుప్తా వెంకటరత్నం, డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్, ఈదర వెంకటపూర్ణచంద్, కొఠారి చేతన్‌రాజ్, కొల్లి రాజేంద్రప్రసాద్, డాక్టర్ జీవనలత పాల్గొన్నారు.

ఘనంగా నాంచారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తెనాలి టౌన్: స్థానిక గంగానమ్మ పేటలోని పిల్లలమర్రి వారి వీధిలో గల విశ్వనాథపల్లి నాంచారమ్మ తల్లి దేవస్థాన 22వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త కొండూరు అంకమరావు, కామేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మహోత్సవాలు వేడుకగా జరిగాయి. కనకతప్పెట్లు, మేళతాళాల వాయిద్యాల నడుమ మహిళలు కలశాలు చేపట్టి ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దేవాలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ గావించారు. ఆలయ ధర్మకర్త కామేశ్వరి మాట్లాడుతూ 24వ తేదీ మధ్యాహ్నం అమ్మవారికి పూజలతో పాటు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కొల్లూరు నాగలక్ష్మి, నాంచారయ్య, శ్రావణ్‌కుమార్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ధార్మిక చింతన అవసరం



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సభ్యులు

తెనాలి టౌన్: ప్రతి ఒక్కరూ ధార్మిక చింతన కలిగి ఉండాలని శ్రీ ఆంజనేయ ధ్యాన యోగ మండలి నిర్వాహకులు కిశోర్ గురూజీ సూచించారు. దేవాలయ పరిశుభ్రత యోగంలో భాగంగా ఆదివారం స్థానిక చినరావూరు సోమేశ్వరస్వామి దేవాలయంలో సభ్యులంతా ఆలయ పరిసరాలను నీటితో పరిశుభ్రం చేశారు. కిశోర్ గురూజీ మాట్లాడుతూ పదేళ్ల కిందట ప్రారంభించిన ఈ యజ్ఞంలో యోగ సాధకులు 100 మంది దాకా నెలలో ఒక దేవాలయాన్ని నీటితో శుద్ధి చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన, పాప భీతి కలిగి ఉండాలని తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి శాంతి కలుగుతుందని వెల్లడించారు. అనంతరం సభ్యులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీనాగరాజు, లత, అరుణకుమారి, రేఖ, నళిని, పురుషోత్తమ కృష్ణ, గోవర్ధనస్వామి, ఎం.శ్రీనివాసరావు, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చాటిన చంద్రిక



మెడల్స్‌తో బొల్లినేని చంద్రిక

మంగళగిరి టౌన్ : సీనియర్ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన క్రీడాకారిణి ప్రతిభ చాటి, పతకాలు సాధించిందని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించిన సీనియర్ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన బొల్లినేని చంద్రిక 84 కేజీల విభాగంలో మూడు పతాలు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రికను, కోచ్ నరేంద్రరాజును గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేన్ వైస్ చైర్మన్ వంశీకృష్ణ, ఏపీ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట వెంకటేశ్వరరావు అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



దుగ్గిరాల: మండలంలోని ఈమని, మోరంపూడి గ్రామాల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరఫున ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటు కలిగిన పట్టభద్రులను కలిసి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు, వై.స్టాలిన్, వి.శేషగిరి, రామారావు, ఎ.పాములు, వై.బాబూరావు, అమిరెడ్డి, శివాంజనేయులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.21లక్షల టోకరా

మంగళగిరి: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు రూ.21 లక్షలకు టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెదవడ్లపూడికి చెందిన మహేంద్ర కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలోని స్నేహితులను కలిసి హైదరాబాద్‌లో ఉద్యోగాలు ఉన్నాయని చెప్పాడు. రూ.3 లక్షలు కడితే నెలకు రూ.20 వేల జీతంతో ఉద్యోగం పొందవచ్చని ఆశ పెట్టాడు. దీంతో ఏడుగురు యువకులు రూ.3 లక్షల లెక్కన రూ.21 లక్షలు మహేంద్రకు ఇచ్చారు. కొన్ని రోజులు తర్వాత అతను ఫోన్ ఎత్తకుండా ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన బాధితులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.